సాక్షి
ఖమ్మం
ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025

శ్రీ వేంకటేశ్వరుడికి పుష్పయాగం

ఎర్రుపాలెం: జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవారికి సుప్రభాత సేవ తదితర పూజలు చేశారు. పంచామృతాభిషేకం తర్వాత 11 రకాల పూలతో పుష్పయాగం జరిపించారు. అంతకుముందు విష్వక్సేనపూజ, హోమం నిర్వహించారు. ఆ తర్వాత శ్రీస్వామి, అమ్మవార్ల నిత్యకల్యాణాన్ని నిర్వహించగా భక్తులు తిలకించారు. కార్యక్రమంలో ఈఓ కె. జగన్‌మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామ చంద్రమూర్తి, ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ, సూపరిం టెండెంట్ విజయకుమారి పాల్గొన్నారు.



యాగం చేస్తున్న అర్చకులు

తొమ్మిదేళ్ల తర్వాత..

సీతారాముల కల్యాణానికి ముఖ్యమంత్రి రాక

- సీఎం రేవంత్‌రెడ్డితోపాటు హాజరు కానున్న పలువురు మంత్రులు
- సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో మధ్యాహ్న భోజనం



శ్రీ సీతారాముల వారి ఎదుర్కోలు ఉత్సవంలో మాలమార్పిడి వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: నేడు భద్రాచలంలో జరగనున్న సీతారాముల కల్యాణానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా భద్రాచలం సమీపంలోని టోబాకో బోర్డు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని పది నిమిషాలపాటు విశ్రాంతి తీసుకున్న తర్వాత శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి చేరుకుంటారు. స్వామివారిని దర్శించుకుని మిథిలా స్టేడియానికి చేరుకుని కల్యాణ వేడుకల్లో భాగం అవుతారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీతారాములకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. కాగా 2016లో సీఎం హోదాలో చివరిసారిగా కేసీఆర్ ఈ సంప్రదాయం పాటించారు. ఆ తర్వాత వివిధ కారణాల వల్ల ఆయన హాజరు కాలేదు. మళ్లీ తొమ్మిదేళ్ల తర్వాత సీఎం హోదాలో పట్టువస్త్రాలు సమర్పించేందుకు రేవంత్‌రెడ్డి ఆదివారం వస్తున్నారు.

వీఐపీల తాకిడి

గతేడాది నవమి వేడుకల సమయంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో సీఎంతో సహా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు ప్రొటోకాల్ వర్తించలేదు. కొందరు ఎమ్మెల్యేలు సాధారణ భక్తుల్లాగే వేడుకలకు హాజరయ్యారు. కానీ, ఈసారి ఉత్సవాలకు వీఐపీల తాకిడి పెరిగింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా రానుండటంతో వీవీఐపీ, వీఐపీ గ్యాలరీలు కిక్కిరిసిపోనున్నాయి. ఈ నేపథ్యంలో ఉభయ దాతల కోటా కింద జారీ చేసే టికెట్లను కూడా తగ్గించారు.

సన్నబియ్యంతో భోజనం

రేషన్ దుకాణాల్లో ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్నబియ్యంతో వండిన అన్నంతో మధ్యాహ్న భోజనం సీఎం రేవంత్‌రెడ్డి చేయనున్నారు. ఇందుకోసం బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన బూరం శ్రీనివాస్ అనే లబ్ధిదారుడి ఇంటిని అధికారులు ఎంపిక చేశారు. రేవంత్‌రెడ్డి సీఎం హోదాలో గతేడాది ఏప్రిల్‌లో భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభానికి, ఆ తర్వాత కొత్తగూడెంలో పార్లమెంటు ఎన్నికల ప్రచార సభకు.. రెండుసార్లు వచ్చారు. దాదాపు ఏడాది తర్వాత జిల్లాకు మూడోసారి వస్తున్నారు. మధ్యాహ్న భోజనం తర్వాత రిజర్వ్ చేసిన 45 నిమిషాల వ్యవధిలో సీఎంను కలిసేందుకు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారు. కాగా భద్రాచలంలో మెరుగులు దిద్దిన ట్రైబల్ మ్యూజియంతోపాటు మాఢవీధుల విస్తరణ పనులను ప్రారంభిస్తారని ప్రచారం సాగినా సీఎం టూర్ షెడ్యూల్‌లో వీటి ప్రస్తావనలేదు.

సీఎం పర్యటన షెడ్యూల్

ఉదయం 8:45 గంటలకు బేగం పేట ఎయిర్ పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి ఉదయం 10 గంటలకు భద్రాచలం హెలిప్యాడ్‌కు, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 10:10 నుంచి 10:30 గంటల వరకు రిజర్వ్ టైం కాగా, 10:30 గంటలకు గెస్ట్‌హౌస్ నుంచి బయల్దేరి 10:45 గంటలకు ఆలయానికి వస్తారు. 10:45 గంటల నుంచి 11:00 గంటల వరకు దర్శనం చేసుకుని, అనంతరం మిథిలా స్టేడియం చేరుకుంటారు. 11:10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కల్యాణ వేడుకలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12:30 గంటలకు మిథిలా స్టేడియం నుంచి సారపాకకు బయల్దేరుతారు. 12:35 గంటల నుంచి మధ్యాహ్నం 1:10 గంటల వరకు సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తారు. ఆ తర్వాత ఐటీసీ గెస్ట్‌హౌజ్ చేరుకోనుండగా, 1:15 నుంచి 2 గంటల వరకు రిజర్వ్ టైం. 2:15 గంటలకు హెలీప్యాడ్‌కు చేరుకుని హైదరాబాద్ బయలుదేరతారు.

సీతమ్మ అందాలు.. రామయ్య గోత్రాలు.!

అలరించిన ఎదుర్కోలు ఉత్సవం

భద్రాచలం: శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో కీలక ఘట్టమైన ఎదుర్కోలు ఉత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. శ్రీరామనవమికి ముందు రోజు వారి వంశాల విశిష్టతలను, గొప్పద నాన్ని వివరించే ఈ వేడుక ఆద్యంతం ఆసక్తిగా సాగింది. గరుత్మంత వాహనంపై స్వామివారిని మిథిలా స్టేడియం ఎదురుగా ఉన్న వైకుంఠ ద్వారం వద్దకు తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం మా వంశం గొప్పదంటే ... కాదు మా వంశమే గొప్పదని చెబుతూ సీతమ్మ వారివైపు అర్చకులు, స్థానాచార్యులు స్థలశాయి, దేవాదాయ శాఖ ప్రినిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, రామయ్య తరఫున పండితులు ఎస్టీజీ కృష్ణమాచార్యుల బృందంతో పాటు దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ చేరి వేడుక నిర్వహించారు. శ్రీ సీతారాముల వారి వైభవాన్ని లోకానికి తెలియజెప్పేందుకే ఎదుర్కోలు ఉత్సవ కార్యక్రమం జరిపినట్లు పండితులు తెలిపారు. హిందూ, ముస్లింల మత సామరస్యాన్ని పెంపొందించే విధంగా భక్తులందరికీ పన్నీరు చల్లారు. గోల్కొండ నవాబైన తానీషాను స్మరింపజేస్తూ భద్రాద్రి ఆలయంలో ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. ఆ తర్వాత ఊరేగింపుగా స్వామివారిని ఆలయానికి తీసుకెళ్లారు. కాగా దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్ పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, వేదపండితుడు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, ప్రధాన అర్చకులు విజయరాఘవన్, రామకోటి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.



మార్పు ఇంటి నుంచే ప్రారంభం కావాలి

- మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి
- జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంమయూరిసెంటర్ : మనం ఆశించే మార్పు ఇంటి నుంచే ప్రారంభించాలనే సూక్తిని బాబు జగ్జీవన్ రామ్ పాటించారని, తన కుమార్తెను ఉన్నత విద్య చదివించారని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహనీయుల జీవితాల నుంచి స్ఫూర్తి పొందేందుకే ప్రభుత్వం జయంతి వేడుకలు నిర్వహిస్తోందని అన్నారు. జగ్జీవన్ రామ్ వంటి మహనీయులు, పెద్దలు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. ఆడపిల్లలకు చదువు ఎందుకు అనే రోజుల్లోనే తన కుమార్తెను సివిల్ సర్వీస్ వరకు చదివించారని అన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ బాటలో పోరాడిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని తెలిపారు. అంతకుముందు ఎన్టీఆర్ సర్కిల్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కలెక్టర్‌తో పాటు ఉత్సవ కమిటీ బాధ్యులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ, ఈడీ నవీన్‌బాబు, డీఎంహెచ్ఓ కళావతి బాయి, జయంత్యోత్సవ కమిటీ కన్వీనర్ జమళ్లముడి దాస్ మహారాజ్, అధ్యక్షుడు కొర్లపాటి చిరంజీవి, గౌరవాధ్యక్షుడు జాకబ్ ప్రతాప్, ఇటికల లత పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి

పోటీ పరీక్షల్లో అభ్యర్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు ప్రణాళికాయుతంగా కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బైపాస్ రోడ్‌లోని జలగం వెంగళరావు బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్–డీ, న్యాయ విభాగం, జూనియర్ లెక్చరర్, ఆర్ఆర్‌బీ, ఐడీబీసీ వంటి వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారితో ఆయన మాట్లాడారు. పరీక్షలకు ఎలా సన్నద్ధమవుతున్నారు, ఎలాంటి పుస్తకాలు కావాలి, ఇంకేమైనా అవసరాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వాటర్ కూలర్లు, స్టడీ చైర్లు ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అప్‌డేటెడ్ పుస్తకాలు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత పాల్గొన్నారు.



రేపటి నుంచి 'పది' మూల్యాంకనం

ఖమ్మంసహకారనగర్: పదో తరగతి పరీక్షలు ఈ నెల 2వ తేదీతో ముగియగా.. ఈ నెల 7వ తేదీ నుంచి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాల్యుయేషన్ (మూల్యాంకనం) ప్రక్రియను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. నగరంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో వాల్యుయేషన్ కార్యక్రమం ప్రారంభం కానుండగా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటోంది. జిల్లాకు 2,13,000 సమాధాన పత్రాలు వచ్చాయి. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనం చేయనుండగా.. డీఈఓ క్యాంపు ఆఫీసర్‌గా ఉంటారు.

రేషన్ దుకాణాల పరిశీలన



సన్న బియ్యం అన్నం తింటున్న డీఎస్ఓ

రఘునాథపాలెం: మండలంలోని రేషన్ దుకాణాలను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ శనివారం పరిశీలించారు. హరియాతండాలో రేషన్ బియ్యం వండించి, రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 1వ తేదీ నుంచి కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తున్నామని, పేదలకు కడుపు నిండా భోజనం పెట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టిందని తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డీటీ వెంకటేశ్వర్లు, ఆర్ఐ నరేశ్ పాల్గొన్నారు.



గిరిజనుడి ఇంట సీఎంకు భోజనం

- ప్రభుత్వం అందించే సన్నబియ్యంతో..
- ఏర్పాట్లను పరిశీలించిన భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్



శ్రీనివాస్ ఇంటిని పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

బూర్గంపాడు: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి కల్యాణం అనంతరం సారపాకకు చెందిన గిరిజనుడు బూరం శ్రీనివాస్ ఇంట్లో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు ఆదివారం భోజనం చేయనున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యంతో పేదల ఇంట్లో భోజనం చేసి లబ్ధిదారులతో మాట్లాడాలనే ఉద్దేశంతో సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించి సీఎంఓ నుంచి శనివారం టూర్ షెడ్యూల్ కూడా విడుదలైంది. కాగా, శ్రీనివాస్ ఇంటిని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఇతర అధికారులు శనివారం పరిశీలించి ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం అందించిన సన్నబియ్యంతోనే అన్నం వండి పప్పు, చారు, కూర, పచ్చడితో భోజనం వడ్డిస్తామని శ్రీనివాస్ తెలిపారు. ఈ నేపథ్యాన పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, నాయకపోడు తెగకు చెందిన గిరిజనుడి ఇంట భోజనానికి సీఎం రావడం సంతోషకరమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం గిరిజనుడి ఇంటికి వెళ్లి వారితో మాట్లాడారు.

క్రికెట్ ఆడుతూ విద్యార్థి మృతి

ఆస్ట్రేలియాకు వెళ్లాల్సిన యువకుడు హఠాన్మరణం



వినయ్ (ఫైల్)

రఘునాథపాలెం: క్రికెట్ ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలి ఓ విద్యార్థి మృతిచెందిన ఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. మండలంలోని కోటపాడుకు చెందిన కామునిసామేలు, విజయలక్ష్మి దంపతుల ఏకైక కుమారుడు వినయ్ (22) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్నాడు. శుక్రవారం కాలేజీలోనే మిత్రులతో కలిసి మైదానంలో క్రికెట్ ఆడుతుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు. తోటి మిత్రులు ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు మృతి చెందాడు. గుండెపోటుతో యువకుడు మృతిచెందాడని వైద్యులు నిర్ధారించినట్లు సమాచారం. కాగా, ఆస్ట్రేలియాలో ఎంఎస్ చదివేందుకు అసరమైన పరీక్షలు రాసి, సిద్ధమవుతున్న తరుణంలో వినయ్ మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఏకైక సంతానం మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

హైకోర్టు జడ్జిని కలిసిన 'బార్' అధ్యక్షుడు



హైకోర్టు జడ్జికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

ఖమ్మంలీగల్: హైకోర్టు జడ్జి నందాను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మం వచ్చిన ఆమెను బార్ అధ్యక్షుడితోపాటు జాయింట్ సెక్రటరీ గద్దల దిలీప్‌కుమార్, అడ్వకేట్ జేఏసీ చైర్మన్ బిచ్చాల తిరుమలరావు, దిరిశాల కృష్ణారావు, కర్లపూడి శ్రీనివాసరావు, పాన్నెకంటి నరసరావు, మల్సూరు తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ముగిసిన మత్స్యకారుల శిక్షణ

కూసుమంచి: పాలేరులోని పీవీ నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో జిల్లాకు చెందిన ఎస్టీ మత్స్యకారులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు, వలలను అందజేశారు. సూర్యాపేట జిల్లా గడ్డిపల్లి కేవీకే సీనియర్ సైంటిస్ట్ లవకుమార్, పాలేరు పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్, పూర్వ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడారు. చేపల పెంపకంలో, ఉత్పత్తిలో ఆధునిక పద్ధతులు పాటించాలని, అందుకు తగిన శిక్షణ అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు నాగరాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరురోజుల్లో పెళ్లి.. అంతలోనే అనంతలోకాలకు..

- శుభలేఖలు పంచుతూ రోడ్డు ప్రమాదంలో వరుడు మృతి
- అతడి తండ్రితో పాటు మరో ఇద్దరికి గాయాలు



బానోత్ వేణు (ఫైల్)

కల్లూరు: మరో ఆరు రోజుల్లో వివాహం కావాల్సిన వరుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన కల్లూరు మండలంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని ఓబులరావుబంజర గ్రామానికి చెందిన బానోత్ వేణు(24)కు ఈనెల 11న వివాహం జరగాల్సి ఉంది. ఈ క్రమంలో ద్విచక్రవాహనంపై తండ్రి చిన్నికృష్ణతో కలిసి బంధు, మిత్రులకు పెళ్లి పత్రికలు పంచి తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో కల్లూరులోని ఓ రెస్టారెంట్ సమీపంలో మరో ద్విచక్ర వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వేణు అక్కడికక్కడే మృతి చెందగా తండ్రికి స్వల్ప గాయాలయ్యాయి. మరో బైక్‌పై ఉన్న బయ్యారపు జస్వంత్ సాయి, ఇందుకాంత్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మం తరలించారు. వేణు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బస్సు ఢీకొని మహిళ మృతి



బానోత్ మారోణి (ఫైల్)

పెనుబల్లి: ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని వీఎం బంజర్ రింగ్‌సెంటర్ వద్ద శనివారం చోటుచేసుకుంది. వీఎం బంజర్ రింగ్‌సెంటర్ సమీపంలో రోడ్డు దాటుతున్న మహిళను సత్తుపల్లి వైపు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ఖమ్మం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన మహిళను మండలంలోని పాతకారాయిగూడెం గ్రామానికి చెందిన బాణోతు మారోణి (50)గా గుర్తించి.. పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వీఎం బంజర్ పోలీసులు తెలిపారు.